PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 310 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 03 నవంబర్ 2026

కవితమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు!



3లో

గ్రేటర్ ప్రెస్‌క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించండి!



3లో

విదేశీ శక్తుల చేతిలో రాహుల్ పావు

రాహుల్ గాంధీపై నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు



న్యూఢిల్లీ,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు చేశారు. విదేశీ శక్తుల ప్రోద్బలంతో దేశంలో అశాంతి సృష్టించేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజల తీర్పుతో ఏర్పడిన ప్రభుత్వాన్ని, రాజ్యాంగ సంస్థలను ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు.హర్యానాలోని మిగతా2లో...

క్లీన్ సిటీ.. సిగ్నల్ ఫ్రీ హైదరాబాద్!

నగర పరిశుభ్రతకు ప్రత్యేక కార్యాచరణ.. ఇంటింటికీ ప్రతిరోజూ చెత్త సేకరణ తప్పనిసరి

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు.. అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు

మున్సిపల్ శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): భాగ్య నగరాన్ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకుండా చూడాలని, ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్త సేకరణ జరగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై మిగతా2లో...



తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యం!

కాంగ్రెస్ పాలనపై అమిత్ షా విమర్శలు

హైదరాబాద్ మహాపాదయాత్రలో కేంద్ర హోంమంత్రి పిలుపు..

కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపేలా ప్రసంగం

హైదరాబాద్,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో బీజేపీ నిర్వహించిన మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా మొజంజాహి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై మిగతా2లో...

ఏపీ పురపోరులో నేడు అసలు సమరం!

ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు.. మధ్యాహ్నం నుంచి ఫలితాల వెల్లడి

13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలపై ఉత్కంఠ



2లో

లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ

- టాస్క్‌అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఒప్పందం.. 643 కళాశాలల్లో అమలు



2లో

షరతులు అంగీకరిస్తే రెండు రోజుల్లో హార్ముజ్ జలసంధి తెరుస్తాం

- అమెరికా ఆంక్షలు ఎత్తివేసి, సైనిక బలగాలను తగ్గించాలని ఇరాన్ డిమాండ్



2లో

'మురసు' తుపాను ముప్పు..

- ఏపీ, తెలంగాణకు రెడ్ అలర్ట్!

దక్షిణ కోస్తా వైపు దూసుకొస్తున్న తీవ్ర తుపాను.. గంటకు 110 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం

తెలంగాణలో పలు జిల్లాలకు భారీ వర్ష సూచన.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక



2లో

పల్లె యువతకు కేటీఆర్ భరోసా..

- ఏఐతో ప్రపంచస్థాయి అవకాశాలు!
- నానక్‌రామ్‌గూడలో క్యాంపస్ హబ్
- ఏఐ ప్రారంభం.. గ్రామీణ యువత ప్రతిభకు ప్రశంసలు
- హైదరాబాద్‌కే ఐటీ పరిమితం కావొద్దు.. పల్లెల్లోనూ సాంకేతిక సంస్థలు రావాలి: కేటీఆర్



2లో

ఢిల్లీని కమ్మేసిన కాలుష్య మేఘాలు

- 324కు చేరిన గాలి నాణ్యత సూచీ.. గ్రాప్-2 ఆంక్షలు అమల్లోకి



2లో

తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులెన్ని?..

అమిత్ షాకు మంత్రి పొన్నం సూటి ప్రశ్న

విభజన హామీలపై ఎందుకు మాట్లాడలేదు? బీజేపీ ఇచ్చిన హామీల సంగతేంటి?

ఎల్‌నినో కరువు నేపథ్యంలో రాష్ట్రానికి తక్షణ సాయం అందించాలని డిమాండ్



2లో

క్లీన్ సిటీ.. సిగ్నల్ ఫ్రీ హైదరాబాద్!

(మొదటి పేజీ తరువాయి)

కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నగర అభివృద్ధి, చెత్త నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలపై ఆయన కీలక సూచనలు చేశారు.**చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు** హైదరాబాద్‌లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. ఇంటింటికీ ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగేలా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు. నగరంలోని రహదారులు, వీధులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం చర్యలు చేపట్టాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వాటి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు.**శుద్ధి చేసిన నీటితోనే పనులు** నగరంలో శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని విస్తరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటి సరఫరాను పెంచాలని సూచించారు. నిర్మాణ పనులు, పార్కులు, పచ్చదనం నిర్వహణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరాను విస్తరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.**ట్రాఫిక్ కష్టాలకు చెక్** మరోవైపు హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సిగ్నల్ ఫ్రీ ప్రయాణానికి అనువుగా అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

పక్కా ప్రణాళికతో ముందుకు నగరంలో పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ అంశాలను సమన్వయంతో చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌ను పరిశుభ్రత, సులభమైన రవాణా వ్యవస్థ కలిగిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

నిలదీశారు.**కాంగ్రెస్‌పై విమర్శలు.. ఎస్ఐఆర్‌కు మద్దతు** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను అమిత్ షా తప్పుబట్టారు. ఓటర్ల జాబితాలో ఉన్న అక్రమాలను సరిదిద్దడం, చనిపోయినవారి పేర్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినవారి పేర్లు, నకిలీ ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగమని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.**చొరబాటుదారుల అంశంపై ఆరోపణలు** ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీపై కూడా అమిత్ షా విమర్శలు చేశారు. ఓటు హక్కుల పరిరక్షణ పేరుతో చొరబాటుదారులకు మద్దతుగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం రాజీ పడబోదని స్పష్టం చేశారు.**మోదీ నాయకత్వంపై ప్రస్తావన** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని అమిత్ షా పేర్కొన్నారు. ప్రజల మద్దతుతోనే బీజేపీ ఎన్నికల్లో విజయాలు సాధిస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.**సర్దార్ పటేల్ సేవలు గుర్తుచేస్తూ..** హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చరిత్రను ప్రస్తావించిన అమిత్ షా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పాత్రను గుర్తుచేశారు. హైదరాబాద్ విముక్తి కోసం పటేల్ చేసిన కృషి చారిత్రాత్మకమని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి అంశాల్లో బీజేపీ తన వైఖరిని ప్రజలకు వివరించాలని అన్నారు.**తెలంగాణలో బీజేపీ బలోపేతమే లక్ష్యం** రాష్ట్రంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని అమిత్ షా పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నించాలని సూచించారు. తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ పెంచేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన అన్నారు.మొత్తంగా హైదరాబాద్ మహాపాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా చేసిన ప్రసంగం తెలంగాణలో బీజేపీ రాజకీయ కార్యాచరణ, కాంగ్రెస్ ప్రభుత్వంపై పార్టీ విమర్శలు, ఎస్ఐఆర్ అంశాల చుట్టూ సాగింది.

'మురసు' తుపాను ముప్పు..

హైదరాబాద్,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ అప్రమత్తమైంది. ముఖ్యంగా తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. నెల్లూరు నుంచి నర్సాపురం మధ్య ఒంగోలు సమీప పంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామున తుపాను తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి.

సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉండటంతో మత్స్యకా రులు వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.

తెలంగాణలో నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. నవంబర్ 3న ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

తుపాను ప్రభావం నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు కొనసాగవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలు పాటించాలని కోరుతున్నారు.

పల్లె యువతకు కేటీఆర్ భరోసా..

హైదరాబాద్,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ప్రపంచస్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు కలిసి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సంస్థను స్థాపించడం అభినందనీయమని ప్రశంసించారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సోమవారం క్యాంపస్ హబ్ ఏఐను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం వేగంగా ఏఐ యుగంలోకి అడుగుపెడుతోందని, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు సహా అన్ని రంగాల్లో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషించబోతోందని అన్నారు. ఏఐని చూసి భయపడాల్సిన అవసరం లేదని, అది మానవాళి అభివృద్ధికి దోహదపడే సాధనమని పేర్కొన్నారు. యువత కొత్త సాంకేతికతలను నేర్చుకుంటూ భవిష్యత్తు అవసరాలకు సిద్ధం కావాలని సూచించారు.ఐటీ రంగం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. పల్లెల్లోని ప్రతిభావంతులైన యువతకు సరైన అవకాశాలు, ప్రోత్సాహం లభిస్తే అద్భుతాలు సృష్టించగలరని అన్నారు. ఉద్యోగాల కోసం ఎదురు చూడటమే కాకుండా, సొంతంగా సంస్థలు స్థాపించి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.గతంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఓ గ్రామంలో వ్యవసాయ రంగంలో ఏఐ వినియోగానికి ప్రయత్నాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. రైతులకు పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ఏఐ ఆధారిత కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. సాంకేతికతను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని, దుర్వినియోగానికి పాల్పడకూడదని సూచించారు.రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాలనలోనూ ఏఐ కీలకంగా మారుతుందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఏఐ సాంకేతికతను అనుసంధానించి, తెలంగాణవ్యాప్తంగా ఐటీ రంగాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ యువతలోని సృజనాత్మకతకు తగిన ప్రోత్సాహం అందిస్తే రాష్ట్రం సాంకేతిక రంగంలో మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులెన్ని?..

హైదరాబాద్,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే పరిమితమైందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కాంగ్రెస్‌పై అనేక ఆరోపణలు చేసిన అమిత్ షా.. తెలంగాణకు సంబంధించిన విభజన హామీలు, కేంద్ర నిధులు, రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం ఎంత నిధులు ఇచ్చిందో, రాష్ట్రం నుంచి ఎంత పన్ను వసూలు చేస్తోందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, అదే సమయంలో బీజేపీ గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలపైనా సమాధానం చెప్పాలని పొన్నం సవాల్ విసిరారు. రైతులకు నెలవారీ పింఛన్లు, ఉచిత విద్యుత్, ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు, పెట్రోల్ ధరను రూ.50కి తగ్గిస్తామన్న హామీలు ఏమయ్యాయని కేంద్ర హోంమంత్రిని నిలదీశారు.తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్రానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్రం ముందుకు రావాలని సూచించారు. దేశంలో 12 ఏళ్ల బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిందని, కాంగ్రెస్ మాత్రం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తోందని అన్నారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపైనా మంత్రి ప్రశ్నలు సంధించారు. విదేశీయుల ఓట్లు తొలగించామని చెబుతున్న బీజేపీ నేతలు.. ఎంతమందిని దేశం నుంచి వెనక్కి పంపించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఓట్ల తొలగింపుపైనే కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోందని తెలిపారు. ఓట్ల తొలగింపు ఫారాల పంపిణీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యాలయాల నుంచే జరుగుతోందని ఆరోపించారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధమా? అని అమిత్ షాకు సవాల్ విసిరారు. దేశ సంపదను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో అమిత్ షా పర్యటన రాష్ట్ర సమస్యలు, అభివృద్ధి అంశాలపై సమాధానాలు ఇవ్వకుండా రాజకీయ విమర్శలకే పరిమితమైందని పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

విదేశీ శక్తుల చేతిలో రాహుల్ పావు

(మొదటి పేజీ తరువాయి)

రోహ్‌తక్‌లో ఆదివారం నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో.. అరాచకత హటావో' పాదయాత్రలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ప్రజాస్వామ్యం గెలిచిందని, ఓడినప్పుడు ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేస్తోందని విమర్శించారు. దేశం గాంధీ కుటుంబం ఆదేశాలతో కాకుండా రాజ్యాంగం ప్రకారమే నడవాలని పేర్కొన్నారు.ఓటర్ల జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను నితిన్ నబీన్ ఖండించారు. 1984 సిక్కుల ఊచకోత ఘటనను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నాయకత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు జయంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పురపోరులో నేడు అసలు సమరం!

అమరావతి,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఆదివారం జరిగిన పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకోసం ఎన్నికల అధికారులు 138 కౌంటింగ్ కేంద్రాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నారు.ఈ ఎన్నికల్లో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించిన స్థానాలకు పోటీ జరిగింది. 13 మేయర్ పదవులకు 153 మంది, 70 మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు 367 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఐదు జిల్లాల్లోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 13 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం రీపోలింగ్ నిర్వహించడంతో ఎన్నికల ప్రక్రియ పూర్తయింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ఈ ఫలితాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అధికార కూటమి తమ పట్టును నిరూపించుకోవాలని భావిస్తుండగా, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ కూడా మెరుగైన ఫలితాలపై ఆశలు పెట్టుకుంది. దీంతో ఎవరి బలం ఎంత? ప్రజలు ఎవరికి పట్టం కట్టారు? అన్నది నేడు తేలనుంది.

షరతులు అంగీకరిస్తే రెండు రోజుల్లో హార్మూజ్ జలసంధి తెరుస్తాం

హైదరాబాద్,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):అమెరికా తమ షరతులను అంగీకరిస్తే రెండు రోజుల్లో హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ తెలిపారు. షరతుల అంగీకారంపైనే ఈ ప్రణాళిక ఆధారపడి ఉంటుందని, ఆ తర్వాతే తదుపరి చర్చలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.హార్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలకు ఇరాన్, ఒమన్ అంగీకరించిన కొత్త మార్గాన్ని అమెరికా గుర్తించాలని విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కోరారు. అమెరికా ఆంక్షలు, నౌకాదళ దిగ్బంధనాన్ని తొలగించడంతో పాటు ప్రాంతంలో సైనిక బలగాలను తగ్గించాలని డిమాండ్ చేశారు.పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలకడం, విదేశాల్లో నిలిపివేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, చమురు రంగంపై ఆంక్షలు ఎత్తివేయడం కూడా ఇరాన్ ప్రధాన డిమాండ్లలో ఉన్నాయి. మధ్యవర్తుల ద్వారా అమెరికాతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఇరాన్ అధికారులు తెలిపారు.

ఢిల్లీని కమ్మేసిన కాలుష్య మేఘాలు

న్యూఢిల్లీ,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రరూపం దాల్చింది. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 324కు చేరడంతో అధికారులు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ ((గ్రాప్)-2 ఆంక్షలను సోమవారం నుంచి అమల్లోకి తెచ్చారు.అక్టోబర్ 31న 117గా ఉన్న ఏక్యూఐ నవంబర్ 1న 261కు, సోమవారం 324కు పెరిగింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులే కాలుష్యం పెరగడానికి ప్రధాన కారణమని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.కాలుష్యాన్ని నియంత్రించి ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఏక్యూఐ స్థాయిని బట్టి నాలుగు దశల్లో గ్రాప్ ఆంక్షలు అమలు చేస్తారు.

లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ

హైదరాబాద్,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) మధ్య సోమవారం ఈ మేరకు ఒప్పందం కుదిరింది.రాష్ట్రవ్యాప్తంగా టాస్క్‌కు అనుబంధంగా ఉన్న 643 కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తారు. ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులకూ ప్రత్యేక కోర్సులు అందుబాటులో ఉంటాయి.శిక్షణలో చేరిన విద్యార్థులకు ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్ ద్వారా 900కు పైగా డిజిటల్ కోర్సులను ఏడాది పాటు ఉచితంగా అందించనున్నారు. అంతర్జాతీయ ధ్రువీకరణ పరీక్షలకు రాయితీ వోచర్లు, పరిశ్రమల నిపుణులతో సమావేశాలు, హ్యాకథాన్‌లు నిర్వహిస్తారు. శిక్షణ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థుల కోసం టాస్క్ ప్రత్యేక ఉద్యోగ మేళాలు నిర్వహించనుంది. కళాశాల అధ్యాపకులకూ ఏఐ, క్లౌడ్ సాంకేతికతల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం, కళాశాలలు, విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని మంత్రి వెల్లడించారు.

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐఆర్‌సీ సదస్సు

హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి ఏర్పాట్లు చేయాలి: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్‌లో నిర్వహించనున్న 85వ భారత రహదారుల కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సదస్సును ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్వహించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నవంబర్ 19 నుంచి 22 వరకు హైటెక్స్‌లో జరగనున్న ఈ జాతీయ సదస్సుకు దేశ, విదేశాల నుంచి సుమారు 3 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు.సదస్సుకు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. సుమారు 400 ప్రదర్శన శాలలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతినిధులకు వసతి, రవాణా, ఆతిథ్యం, భద్రత తదితర సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.తెలంగాణలో రహదారుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాల ప్రగతిని జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేసేలా సదస్సును నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

గ్రేటర్ ప్రెస్‌క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించండి!

అవసరమైతే అడహాక్ కమిటీ ఏర్పాటు చేయాలి

బైలా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కార్యవర్గం

రెండేళ్ల పదవీకాలం ముగిసినా ఎన్నికల ఊసే లేదు

సభ్యుల హక్కులకు భంగం.. నిర్వహణపై అనుమానాలు

హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లకు టీడీఎంయూ ఆధ్వర్యంలో వినతిపత్రాలు



హనుమకొండ సిటీ, నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ (టీడీఎంయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్‌పేయి, సత్యశారదలను యూనియన్ నేతలు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రెస్‌క్లబ్ బైలా ప్రకారం కార్యవర్గం పదవీకాలం రెండేళ్లు మాత్రమేనని, గడువు ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడం సభ్యుల హక్కులకు విఘాతమని పేర్కొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు 2022 డిసెంబర్‌లో ఎన్నికలు జరిగాయని, ఈ లెక్కన 2024 డిసెంబర్‌తోనే ప్రస్తుత కార్యవర్గం పదవీకాలం ముగిసిందని కలెక్టర్లకు వివరించారు. అయినప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా కార్యవర్గం కొనసాగుతుండటంపై సభ్యుల్లో ఆందోళన నెలకొందన్నారు. క్లబ్ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలంటే వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని కోరారు.

అర్హులైన సభ్యులతో ఓటర్ల జాబితా రూపొందించాలి

ఎన్నికల జాప్యంపై ప్రస్తుత కార్యవర్గం నుంచి వివరణ తీసుకోవాలని, అర్హులైన సభ్యులతో ఓటర్ల జాబితా రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే బైలా నిబంధనల ప్రకారం అడహాక్ కమిటీని ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అరెళ్లి కిరణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు, కోశాధికారి పల్లె రవి వంశీ మోహన్, ఉపాధ్యక్షుడు మెహన్ రావు, సహాయ కార్యదర్శి బూర నగేష్, కార్యవర్గ సభ్యులు సలెందర్ రవీందర్, ముల్క రవి, దాసరి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

కవితమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు!

తక్కెళ్లపల్లి రవీందర్ రావు వెంటనే క్షమాపణ చెప్పాలి

బహుజనుల హక్కుల కోసం పోరాడుతున్న బాణం కవితమ్మ..

తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, రాష్ట్ర నాయకులు కిషన్ నాయక్



ఖమ్మం, నవంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్): బహుజనుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మపై బీఆర్ఎస్ నాయకుడు తక్కెళ్లపల్లి రవీందర్ రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్ స్పష్టం చేశారు. కవితమ్మపై చేసిన వ్యాఖ్యలకు తక్కెళ్లపల్లి రవీందర్ రావు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.సోమవారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్కే హుస్సేన్ మాట్లాడుతూ.. కవితమ్మ బహుజనుల బాణమని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆమె ప్రజల్లోకి వెళ్తూ బహుజనుల గొంతుకగా నిలుస్తుండటాన్ని జీర్ణించుకోలేకనే కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.అనంతరం తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు, బంజారా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ.. తక్కెళ్లపల్లి రవీందర్ రావు వ్యాఖ్యలు అహంకారపూరితంగా ఉన్నాయని అన్నారు. కవితమ్మ బహుజనుల కోసం ముందుకు రావడాన్ని ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించేది లేదని, కవితమ్మకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపై బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తే తగిన రీతిలో స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు.రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ రెండు స్థానాల్లోనూ బీసీ బిడ్డలకు అవకాశం కల్పించిందని, పట్టభద్రులు తమ పార్టీకి మద్దతుగా నిలవాలని కిషన్ నాయక్ విజ్ఞప్తి చేశారు.ఈ మీడియా సమావేశంలో తెలంగాణ రక్షణ సేన ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోరం వీరభద్రరావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రాజ్ కుమార్ నాయక్, పార్టీ జిల్లా నాయకుడు వనం నాగేందర్, కార్మిక సంఘం (టీఆర్టీయూ) జిల్లా అధ్యక్షుడు జక్కుల ప్రకాశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కార్పొరేషన్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

- బండి సంజయ్ రాజీనామా చేయాలి: తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ డిమాండ్



కరీంనగర్, నవంబర్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ పాలకవర్గం సభ్యులపై వస్తున్న అవినీతి, అక్రమ వసూళ్ల ఆరోపణలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ బాధ్యత వహించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఇతరులకు నీతులు చెప్పడం కాదని, ముందుగా సొంత పార్టీ ప్రజాప్రతినిధుల వ్యవహారంపై విచారణకు ఆదేశించాలని ఆయన కోరారు. కరీంనగర్‌లో బీజేపీ మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు కార్పొరేటర్లపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్వయంగా చేసిన వ్యాఖ్యలు నగరంలో చర్చనీయాంశంగా మారాయని హరిప్రసాద్ పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారి నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారంటూ పార్టీ ప్రజాప్రతినిధులను ఆయన హెచ్చరించినట్లు వచ్చిన వ్యాఖ్యల నేపథ్యంలో, కార్పొరేషన్‌లో పరిస్థితి ఎంతవరకు వెళ్లిందో ప్రజలు ఆలోచించాలని అన్నారు.బీజేపీ పాలకవర్గంలో అవినీతి సొమ్ముల పంపకాల విషయంలో మేయర్, డిప్యూటీ మేయర్ మధ్య విభేదాలు ఉన్నాయంటూ ఆ రోపణలు విని పిస్తున్నాయని, ఈ వ్యవహారాలన్నింటి పై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు ఒకవైపు అవినీతికి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తూ, మరోవైపు సొంత పార్టీ ప్రజాప్రతినిధులపై వస్తున్న ఆరోపణల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ నగర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు, ఇప్పుడు ప్రతి పనికి రేట్లు నిర్ణయిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆరోపణలపై వాస్తవాలను వెలికితీసి ప్రజలకు వెల్లడించాలని కోరారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను సంబంధిత విచారణ సంస్థలు సుమోటోగా పరిగణించి దర్యాప్తు చేపట్టాలని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వెంటనే స్పందించాలని హరిప్రసాద్ డిమాండ్ చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కరీంనగర్ నగర అభివృద్ధికి చేసిన కృషిపై కూడా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు. అవినీతిపై విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్ నైతిక బాధ్యత వహించి తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని, కరీంనగర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ రక్షణ సేన తరఫున హరిప్రసాద్ డిమాండ్ చేశారు.

గుండెపోటుతో మృతి చెందిన దుర్గాప్రసాద్ అంత్యక్రియల్లో పాల్గొన్న బీఎస్పీ నాయకులు



హుజురాబాద్,నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): హుజురాబాద్ మండలం కనుకుల గిద్ది గ్రామానికి చెందిన చల్లూరి ప్రమీలశరబంధం దంపతుల పెద్ద కుమారుడు చల్లూరి దుర్గాప్రసాద్ (29) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఎస్పీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అంబాల ప్రభాకర్ స్వగ్రామానికి చేరుకుని దుర్గాప్రసాద్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పాడె మోసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చిన్న వయసులోనే దుర్గాప్రసాద్ మృతి చెందడంతో గ్రామ ప్రజలు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు మారుపల్లి మొగిలయ్య, అంబాల శ్రీరామ్, అంబాల సాయిలు, అంబాల చంద్రయ్య, గంగారపు తిరుపతి, రామ్మూర్తి, రమేష్, రవి, గోపి సురేష్, గోపి, ఇనుగాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి: సండ్ర



సత్తుపల్లి, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. సత్తుపల్లిలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావే శంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నవంబర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి, పెనుబల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు.

మూడు రోజులుగా మంచినీటి లీకేజీ.. అధికారుల నిర్లక్ష్యం!

- మిషన్ భగీరథ నీరు వృథా అవుతున్నా పట్టించుకోని అధికారులు



జవహర్ నగర్, నవంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్): జవహర్ నగర్ పరిధిలోని మల్కారం పరిసర ప్రాంతాల్లో మిషన్ భగీరథ మంచినీరు గత మూడు రోజులుగా లీకేజీ కారణంగా వృథాగా పోతోంది. సమస్యను పరిష్కరించాల్సిన సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.భవిష్యత్తులో మంచినీటి కొరత ఏర్పడే అవకాశాలున్నాయని, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రభుత్వ శాఖలు, వివిధ సంస్థలు ప్రజలకు సూచిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విలువైన తాగునీరు మూడు రోజులుగా వృథాగా ప్రవహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు నిరంతర మంచినీటి సరఫరా అందించాల్సిన అధికార యంత్రాంగం ఇలాంటి సమస్యలపై తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని వెంటనే అరికట్టి, వృథా అవుతున్న మంచినీటిని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఖమ్మం వాసి మండలోజు సుధాకర్‌కు హైదరాబాద్‌లో ఘన సన్మానం

- 'అలై బలై' కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌కు ప్రత్యేక గుర్తింపు



ఖమ్మం, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు, ఖమ్మంలోని సేక్రెడ్ హార్ట్ పాఠశాల పీఈటీ మండలోజు సుధాకర్‌కు హైదరాబాద్‌లో ఘన సన్మానం లభించింది. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఫిట్‌నెస్-9 జిమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలై బలై' కార్యక్రమంలో ఆయనను ప్రత్యేకంగా గౌరవించారు.రాష్ట్రానికి చెందిన వెయిట్ లిఫ్టర్లు, కోచ్‌లను సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు సందడిగా సాగాయి. తమ పాఠశాల ఉపాధ్యాయుడికి ప్రత్యేక గుర్తింపు లభించడంపై సేక్రెడ్ హార్ట్ పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసి అభినందించింది.

అర్హులకే షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి
పథకాలు అందుతున్నాయా?

● నకిలీ ధ్రువపత్రాలతో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు.. అధికారుల పరిశీలనకు ప్రజల విజ్ఞప్తి





కరీంనగర్, నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు అర్హులైన లబ్ధిదారులకే అందుతున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. కొందరు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఏజెంట్ల ద్వారా కమిషన్లు చెల్లిస్తూ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన పేద కుటుంబాలకు అందాల్సిన ఆర్థిక సాయం, అనర్హుల చేతుల్లోకి వెళ్తే నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఆదాయం, ఇతర అర్హతలు, సమర్పించిన ధ్రువపత్రాల నిజానిజాలను ధృవీకరించాలని ప్రజలు కోరుతున్నారు. నకిలీ పత్రాలు సమర్పించినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన పేద కుటుంబాలకే అందేలా అధికారులు పారదర్శకంగా విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ నేషనల్ చీఫ్ నితిన్ నబీన్
కరీంనగర్ పర్యటన వాయిదా

● దీపావళి తర్వాత 'మహా పాదయాత్ర'కు హాజరుకానున్నట్లు ప్రకటన



కరీంనగర్ నవంబర్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్): భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన వాయిదా పడింది. అనివార్య కారణాల వల్ల ఈ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.అయితే, దీపావళి పండుగ ముగిసిన వెంటనే తాను కరీంనగర్‌లో పర్యటిస్తానని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన 'మహా పాదయాత్ర'కు తానే స్వయంగా హాజరవుతానని నితిన్ నవీన్ పేర్కొన్నారు. "కరీంనగర్ కాషాయ దండు ఉత్సాహాన్ని, వారి జోష్‌ను నేరుగా కళ్లారా చూడాలని ఉత్సాహంగా ఉన్నానని, పార్టీ శ్రేణుల్లో జోష్ నింపే వ్యాఖ్యలను నితిన్ నబీన్ చేశారు. **మహా పాదయాత్రను విజయవంతం చేయాలి: బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం పిలుపు** బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పర్యటన వాయిదా పడిన సందర్భంగా బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం స్పందిస్తూ, పార్టీ శ్రేణులందరూ రాబోయే మహా పాదయాత్ర కోసం సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఇదివరకు ఎన్నడూ చూడని రీతిలో, కనివిని ఎరగని స్థాయిలో ఈ కరీంనగర్ మహా పాదయాత్రను దిగ్విజయం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త శ్రమించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలే కాకుండా బిజెపి అభిమానులు, శ్రేయోభిలాషులు ప్రజలను భారీ ఎత్తున ఈ పాదయాత్రలో భాగస్వాములను చేయాలని సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. దీపావళి తర్వాత జరగబోయే ఈ మహా పాదయాత్రతో జిల్లాలో పార్టీ మరింత పుంజుకుంటుందని, కరీంనగర్ కాషాయ కోటగా మరోసారినిరూపితమవుతుందని జిల్లా నాయకత్వం ధీమా వ్యక్తం చేసింది.

శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా సువర్ణప్రాశన హోమం





కరీంనగర్, నవంబర్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్): శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం, ఆయురారోగ్యం మరియు శ్రేయస్సును ఆకాంక్షిస్తూ సువర్ణప్రాశన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ ప్రత్యేక హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సాంప్రదాయబద్ధంగా సువర్ణప్రాశన చుక్కలను వేశారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో ఆరోగ్యం, శారీరక దృఢత్వం, మానసిక వికాసం పెంపొందుతుంది. కోల అన్నారెడ్డి, ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్ యజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, బొడ్ల శ్రీనివాస్, కొత్తూరి ముకుందశీ, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, తాటిపల్లి రాజేశ్వర్ రావు, రాపర్తి శ్రీనివాస్, ఆచార్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ తెలియజేశారు.

కరీంనగర్ 'శ్రీ వెంకటేశ్వర ఫైర్‌వర్క్స్' ఆధ్వర్యంలో పటాకుల విక్రయాలు

- స్టాల్ నెం. 2లో ప్రత్యేక ఆకర్షణగా కేజీ సేల్!



కరీంనగర్, నవంబర్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్): దీపావళి పండుగను పురస్కరించుకుని కరీంనగర్ పద్మనగర్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పెద్ది వేణుగోపాల్ అండ్ బ్రదర్స్ వారి సౌజన్యంతో ఏర్పాటైన 'శ్రీ వెంకటేశ్వర ఫైర్‌వర్క్స్' (స్టాల్ నెం. 2) ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. అన్ని రకాల బ్రాండెడ్ పటాకులు ఇక్కడ ప్రత్యేక ధరలకు లభిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. పండుగను ఆనందంగా జరుపుకునేందుకు వీలుగా స్టాల్ నెం. 2లో ప్రత్యేకంగా '2 కేజీ సేల్' ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చారు.అన్ని రకాల ప్రసిద్ధ బ్రాండ్లకు చెందిన టపాసులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని, కరీంనగర్ పట్టణం పద్మనగర్,ఎగ్జిబిషన్ గ్రౌండ్లో స్టాల్ 2 ను సందర్శించాలని ,కస్టమర్లు నాణ్యమైన పటాకులను తక్కువ ధరలకే కొనుగోలు చేయడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.పటాకుల కొనుగోలుకు మరిన్ని వివరాల కోసం 9849353076, 9885023012, 9885544436 చరవాణి నంబర్లు సంప్రదించవచ్చని తెలిపారు.



కొత్తపల్లిలో దూడల నట్టల నివారణ కార్యక్రమం

కొత్తపల్లి నవంబర్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్): దూడల నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని కొత్తపల్లిలో రైతుల దూడలకు, ఎద్దులకు, మరియు ఇతర పశువులకు నట్టల నివారణ మందులు త్రాగించడం జరిగింది.ఈ కార్యక్రమన్ని 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్ ప్రారంభించారు. కార్యక్రమం లో వేముల చంద్రశేఖర్, మండల పశు వైద్యాధికారి డా. అల్లరి సత్యనారాయణ, పశు సంపద అధికారి వంగపల్లి శ్రీనివాస్ రెడ్డి (మూా), బుస బుచ్చయ్య, పరుశరాములు, పశు మిత్ర మెరుగు లక్ష్మి, పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గంగాధర మల్లేశం, మద్దెల వెంకటేష్, కుతటి కిషన్, ప్రవీణ్ రెడ్డి, నోముల విఠల్ రెడ్డి, నరహరి నారాయణ రెడ్డి తదితర రైతులకు చెందిన దూడలకు పైపిరాజన్ నట్టల నివారణ మందులు తాగించారు.

రైతును ఆదుకునేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారత్ కిసాన్ సంఘటన్ విజ్ఞప్తి



హైదరాబాద్, నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, సాగునీటి కొరత ఏర్పడే ముప్పు ఉన్నందున రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని భారత్ కిసాన్ సంఘటన్ ఏపీ కో-కన్వీనర్ దారా రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు అండగా నిలిచి, విత్తనాలు-ఎరువుల పంపిణీ నుంచి దిగుబడుల విక్రయం వరకు పూర్తి భరోసా కల్పించాలని కోరారు.వర్షపాత లభ్యతను బట్టి ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, సూక్ష్మ సేద్యం, నీటి సంరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పంటల బీమా పరిహారాన్ని సకాలంలో అందిస్తూ, గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీల జీవనోపాధి దెబ్బతినకుండా ఆర్థిక సహాయం, పశు సంవర్ధక రంగానికి మద్దతు మరియు ప్రత్యా మ్నాయ ఉపాధి అవకాశాలు చూపాలని పేర్కొన్నారు. 'రైతే రాజు' అనే నినాదం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలని, దేశ ఆహార భద్రతను కాపాడే రైతును ఆదుకోవడమే ప్రభుత్వాల ప్రథమ ప్రాధాన్యం కావాలని ఆయన స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బొడ్డు గురవయ్యకు పరామర్శ.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్

- మాదిగ హక్కుల దండోరా ఉద్యమంలో గురవయ్య పాత్ర అభినందనీయం



నేలకొండపల్లి,నవంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):మాదిగ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తూ, దండోరా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తున్న మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్ఈ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు గురవయ్య త్వరగా కోలుకోవాలని దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు.ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన బొడ్డు గురవయ్య, ప్రస్తుతం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పాలేరు నియోజకవర్గం, నేలకొండపల్లి మండలం, ముజ్జుగూడెం గ్రామంలోని గురవయ్య నివాసానికి వెళ్లిన మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్ఈ రాష్ట్ర అధ్యక్షులు దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గురవయ్య త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని తిరిగి ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. మాదిగ హక్కుల సాధన కోసం గురవయ్య చేస్తున్న కృషి, ఉద్యమంలో ఆయన పోషిస్తున్న క్రియాశీలక పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ఉద్యమ బాటలో పయనించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ఢిల్లీలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన కరీంనగర్ అర్బన్ కాంగ్రెస్ నేతలు

● రాహుల్ గాంధీ సభ విజయవంతంపై చర్చ..

కరీంనగర్ నుంచి 70 మంది నాయకులు, కార్యకర్తల హాజరు



న్యూఢిల్లీ, నవంబర్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ను కరీంనగర్ అర్బన్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభ విజయవంతం కావడంపై చర్చించారు. కరీంనగర్ జిల్లా నుంచి మొత్తం 70 మంది బస్సు, విమానం, రైలు మార్గాల్లో ఢిల్లీకి చేరుకుని సభలో పాల్గొన్నట్లు వివరించారు. ఇందులో బస్సులో 36 మంది, విమానంలో 24 మంది, రైలులో 10 మంది హాజరైనట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో చేపట్టిన సమీకరణ, పార్టీ శ్రేణుల భాగస్వామ్యంపై పీసీసీ అధ్యక్షుడితో చర్చించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పర్వతం మల్లేశం, వరాల నర్సింగం, కాంతల జగన్ రెడ్డి, 17వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంకణాల అనిల్, ఇమ్రాన్ మహాత్, పెంట శేఖర్, ఇమ్రాన్ గని, ఆసిఫ్, శ్రీకాంత్, గట్టు ప్రసాద్, కొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గుర్తి మురళి, యూత్ కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు జారిపోతుల వాసు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి పథకంలో నకిలీ రశీదుల బాగోతం!

- ములుగు జిల్లాలో వెలుగుచూసిన అక్రమ దరఖాస్తులు..



ములుగు, నవంబర్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్): ములుగు జిల్లా ఏటూరునాగారంలో కళ్యాణలక్ష్మి పథకాన్ని దుర్వినియోగం చేసేందుకు నకిలీ వివాహ రశీదులు, ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది.బూటారంకు చెందిన అఖిల్ అనే వ్యక్తి 2025లో వివాహం జరిగినట్లు నకిలీ రశీదులు సృష్టించి కళ్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అధికారుల విచారణలో అసలు విషయం బయటపడింది. అతనికి 2022లోనే వివాహం జరగ్గా, రికార్డుల్లో 2025గా మార్చి దరఖాస్తు చేసినట్లు తేలింది.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అక్రమంగా పొందేందుకు నకిలీ పత్రాలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ధర్మ రక్షణకు దుర్గావాహిని సిద్ధం కావాలి: ప్రగ్యా దీదీ

● హైదరాబాద్‌లో హిందూ యువ మహిళల సమ్మేళనం.. 1,100 మందితో శక్తి సంచలన్





హైదరాబాద్, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): మహిళలు ధైర్యంగా ముందుకు సాగుతూ ధర్మ, దేశ రక్షణలో కీలక పాత్ర పోషించాలని దుర్గావాహిని అఖిల భారత కన్వీనర్ ప్రగ్యా దీదీ పిలుపునిచ్చారు. పాతబస్తీ గౌలిపురలో నిర్వహించిన హిందూ యువ మహిళల సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. ఝాన్సీ లక్ష్మీబాయి వీరత్వం, జిజియాబాయి మాతృత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.సమ్మేళనానికి ముందు 1,100 మంది దుర్గావాహిని కార్యకర్తలు పాతబస్తీలో శక్తి సంచలన్ ర్యాలీ నిర్వహించారు. లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయం వద్ద కర్రసాము, కత్తియుద్ధ విన్యాసాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

పిట్టలపల్లి చౌరస్తాలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని

నేడు ప్రజావాణిలో ఆకుల మనోహర్ ఫిర్యాదు..



గంగాధర నవంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం గంగాధర ఎక్స్ రోడ్ నుండి కొదురుపాక వరకు ఉన్న డబుల్ రోడ్డు పైన జరుగుతున్న ప్రమాదాలు అరికట్టాలని ముఖ్యంగా పిట్టల పల్లి గ్రామంలో నాలుగు కూడలి రోడ్డు వద్ద గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నో ప్రమాదాలు నెలకు సుమారు ఐదు నుండి 6 యాక్సిడెంట్లు జరుగుతున్నవి అని గతంలో కూడా ఆర్ & బి అధికారి ఈ ఈ గార్లకు గతంలో కూడా కలిసి వినతి పత్రం ఇచ్చి ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లను వేయించాలని ప్రమాదాలు జరగకుండా చూడాలని పలుసార్లు కలిసినా కూడా ఇదివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తో ఈ మధ్య కాలంలో కూడా చాలామందికి తీవ్రమైన గాయాలు మరియు ఇటీవల కాలంలోనే రోడ్డు ప్రమాదంతో ఇద్దరు మృతి చెందగా నేడు గంగాధర ఎంపీడీవో ఆఫీస్ లో ప్రజావాణి వేదిక ద్వారా ఆకుల మనోహర్ వినతి పత్రం నుంచి ప్రమాదాలను అరికట్టాలని అధికారులను కోరారు.

తోట కరుణాకర్‌కు రూ.7 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత


● నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర ఏఎంసీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్‌ను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7 లక్షల ఎల్ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



కల్లూరు, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): ప్రజావాణిలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుకు ప్రాధాన్యతనిస్తూ నిర్లక్ష్యం వహించకుండా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

మంచినీళ్లపల్లి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- డ్రైనేజీ, తాగునీరు, ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై ఎంపీడీఓకు గ్రామస్తుల వినతి.



మల్లంపల్లి, నవంబర్ 2 (పి సి డబ్ల్యూ న్యూస్): మల్లంపల్లి మండల కేంద్రంలోని మంచినీళ్లపల్లి గ్రామంలో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మురుగునీరు నిల్వ ఉండకుండా పక్కా డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి ప్రతి ఇంటికీ నిరంతరాయంగా మంచినీరు అందేలా అవసరమైన పైపులైన్లు, నీటి నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని, సొంత ఇళ్లు లేని పేదలకు ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యలకు తాత్కాలిక చర్యలు కాకుండా నిధులు కేటాయించి శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అధికారులు గ్రామాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి సమస్యలను పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ప్రజలు ప్రతిసారీ సమస్యల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, మంచినీళ్లపల్లి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీడీఓను గ్రామస్తులు కోరారు.

మండలం ఉంది.. మౌలిక వసతులేవి?

మల్లంపల్లిలో ఇంకా పూర్తికాని ప్రభుత్వ కార్యాలయాలు

కరువు మండలంగా ప్రకటించాలి..

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజావాణిలో ఎంపీడీఓకు

బీఆర్ఎస్ నాయకుల వినతి




మల్లంపల్లి నవంబర్ 2 (పి సి డబ్ల్యూ న్యూస్): మండలంగా ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా మల్లంపల్లిలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రాలేదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, 108 అంబులెన్స్, బస్టాండ్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మల్లంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు ప్రభుత్వ సహాయం అందించాలని కోరుతూ సోమవారం మండల ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల ఏర్పాటుకు సంబంధించిన గెజిట్‌లు విడుదలై రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు పూర్తిస్థాయి పరిపాలనా సౌకర్యాలు అందడం లేదన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణంతోనే అభివృద్ధి పూర్తయినట్లు భావించరాదని, మిగిలిన కీలక ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించి సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గత ప్రజావాణిలో సమర్పించిన వినతులకు కూడా పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని రైతుల పరిస్థితులను పరిశీలించి కరువు మండలంగా ప్రకటించడంతో పాటు అర్హులైన రైతులకు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రకటనలు, హామీలకే పరిమితం కాకుండా నిధులు కేటాయించి అభివృద్ధి పనులను ఆచరణలో చూపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు మొర్రి రాజు, మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, సీనియర్ నాయకులు నారోజు హరినాథ్, చిట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మెరుగు రాజు, మూడెడ్ల నవీన్, మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత సత్తా చాటాలి!

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి

యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలి ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి ఎడ్ల అనిల్ రెడ్డి పిలుపు



ములుగు, నవంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):ములుగు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత తమ సత్తా చాటాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత భాగస్వామ్యం మరింత పెరగాలని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి ఎడ్ల అనిల్ రెడ్డి పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ఎడ్ల అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతుల అభిప్రాయాలకు, సమస్యలకు ప్రాతినిధ్యం కల్పించే ముఖ్యమైన ప్రజాస్వామ్య ప్రక్రియ అని పేర్కొన్నారు. ఎంతో కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించిన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలకు సంబంధించిన సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందన్నారు. అయితే చాలామంది అర్హులైన యువత ఓటరు నమోదుపై సరైన అవగాహన లేకపోవడంతో ఈ ప్రక్రియకు దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి గ్రామం, ప్రతి మండలంలో పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న పట్టభద్రులు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తమ అర్హతలను పరిశీలించుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాల గురించి ఆలోచించకుండా, ప్రజాస్వామ్య ప్రక్రియలో నిరంతరం భాగస్వాములు కావాలని సూచించారు.యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, పట్టభద్రుల సంక్షేమం వంటి అంశాలపై అవగాహన ఉండాలని అన్నారు. తమ సమస్యలను ప్రశ్నించే హక్కుతో పాటు, ప్రజాస్వామ్యబద్ధంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ఓటు హక్కును కూడా ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు.ములుగు జిల్లాలోని అర్హులైన పట్టభద్రులందరూ ముందుకు వచ్చి ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనాలని, తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలని ఎడ్ల అనిల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఎన్నికల్లో యువత చైతన్యవంతమైన భాగస్వామ్యం ప్రజాస్వామ్యానికి మరింత బలాన్నిస్తుందని ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ డీఏ బకాయిలు ఏకమొత్తంగా చెల్లించాలి

అన్ని ఆసుపత్రుల్లో ఆరోగ్య కార్డులు అమలు చేయాలి: తాళ్లూరి వేణు



ఖమ్మం, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పెండింగ్ డీఏ బకాయిలను విడతల వారీగా కాకుండా ఏకమొత్తంగా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం నగరంలోని పెన్షనర్స్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రెండు డీఏలకు సంబంధించిన బకాయిలతో పాటు ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఆరోగ్య కార్డులను అన్ని ఆసుపత్రుల్లో అమలు చేసి, వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఆర్సీ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని, ఆరోగ్య కార్డులను అంగీకరించని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగులు, పెన్షనర్లు కూడా అండగా నిలిచారని, వారి సమస్యలను విస్మరించడం తగదని అన్నారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఐక్యత, ఓటు బలం ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు.సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దుబాకుల వెంకటేశ్వర్లు, సంఘం నాయకులు పాల్గొన్నారు. సుమారు 200 మంది పెన్షనర్లు హాజరయ్యారు.



మున్నూరుకాపుల ఐక్యతకు వేదికగా వనసమారాధన

ఈనెల 15న ఖమ్మంలో జరిగే వనసమారాధనను విజయవంతం చేయాలి

సన్నాహక సమావేశంలో మున్నూరుకాపు సంఘం నేతల పిలుపు



ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) మున్నూరుకాపు సామాజిక వర్గ ఐక్యతను, ఆత్మగౌరవాన్ని, సంఘటిత శక్తిని చాటిచెప్పేలా ఖమ్మం నగరంలో ఈనెల 15న నిర్వహించనున్న వనసమారాధన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మున్నూరుకాపు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సమాజ అభ్యున్నతి, హక్కుల సాధన, భవిష్యత్ తరాల బంగారు భవిష్యత్తు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురంలో ఎంపీ వద్దిరాజు క్యాంపు కార్యాలయంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు శీలం శెట్టి వీరభద్రం అధ్యక్షతన సోమవారం సాయంత్రం వనసమారాధన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ.. ఖమ్మం అల్లిపురం రోడ్డులోని చెరుకూరి మామిడి తోటలో జరిగే వనసమారాధన కేవలం కలయిక కార్యక్రమం మాత్రమే కాదని, మున్నూరుకాపుల ఐక్యత, ఆత్మవిశ్వాసం, సామాజిక బలాన్ని చాటిచెప్పే గొప్ప వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.సమాజంలోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత రాజకీయ అభిప్రాయాలు, విభేదాలకు అతీతంగా సంఘం ప్రయోజనాల కోసం ఒకే తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా ఎవరికి ఎలాంటి అభిప్రాయాలు ఉన్నప్పటికీ సామాజిక ఐక్యత విషయంలో అందరూ ఒక్కటిగా నిలవాలని, మన సమాజ బంధమే మన బలమని స్పష్టం చేశారు. ఐకమత్యంతోనే హక్కులను సాధించుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించగలమని పేర్కొన్నారు.మున్నూరుకాపు సామాజిక వర్గ జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలతో పాటు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు కల్పించాలనే డిమాండ్లను ఈ వనసమారాధన వేదికగా బలంగా వినిపించాలని నాయకులు అభిప్రాయపడ్డారు. సమాజంలోని యువత, మహిళలు, విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, గౌరవ అధ్యక్షులు కొత్తా సీతారాములు, మాజీ అధ్యక్షులు పార నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్, మెంతుల శ్రీశైలం, పొదిలా రవికుమార్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పగడాల మంజుల, సంఘం జిల్లా నాయకులు తాళ్లూరి హన్మంతరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, తోట రమేష్, మడూరి పూర్ణచందర్ రావు, పార ఉదయ్, తోట వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, కొల్లపాక రమాదేవి, పసుపులేటి నాసరయ్య, కేదాసు నర్సయ్య, మాడిశెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల కృష్ణ, మేకల శ్రీనివాసరావు, మేకల నాగేందర్ పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్య అర్చకుల వేతనాలు పెంచాలి

- నెలకు రూ.25 వేల వేతనం ఇవ్వడంతో పాటు ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి



హైదరాబాద్, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): ధూప దీప నైవేద్య పథకం కింద పనిచేస్తున్న అర్చకులకు నెలకు కనీసం రూ.25 వేల వేతనం చెల్లించాలని, వారి ఉద్యోగాలను తక్షణమే రెగ్యులరైజ్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాదు వాసుదేవ శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాచిగూడలోని తుల్జా భవన్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.వాసుదేవ శర్మ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,570 మంది అర్చకులు గత 18 ఏళ్లుగా ధూప దీప నైవేద్య పథకం కింద సేవలంది స్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం నెలకు రూ.6 వేల గౌరవ వేతనంతో పాటు పూజా సామగ్రి ఖర్చుల కోసం రూ.4 వేలు మాత్రమే అందిస్తోందన్నారు.పెరిగిన నిత్యావసర ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా ఈ మొత్తం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న అర్చకులందరికీ ఉద్యోగ భద్రత కల్పించి, రూ.25 వేల వేతనం అందించాలని కోరారు. అర్చకుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మానవీయ దృక్పథంతో స్పందించి వేతనాలు పెంచాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.సమావేశంలో డాక్టర్ పోతులపాటి రామలింగేశ్వర శర్మ, గంగు కృష్ణచైతన్య, కొండూరి విశాలాక్షి తదితర అర్చక సంఘం నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ అధికారం చేపట్టడం తథ్యం: ఠాకూర్ గోపాల్ సింగ్

- అమిత్ షా 'మహా పాదయాత్ర'కు గోషామహల్ నుండి భారీగా తరలివెళ్లిన కార్యకర్తలు





హైదరాబాద్, నవంబర్ 02(పిసిడబ్ల్యూ న్యూస్): ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం... అరాచకత్వాన్ని అంతం చేద్దాం" అనే నినాదంతో ఎస్ఐఆర్ (సర్) పై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతల తీరును నిరసిస్తూ కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా చేపట్టిన మహా పాదయాత్రకు విశేష స్పందన లభించింది.సోమవారం మధ్యాహ్నం నిజాం కాలేజ్ మైదానం వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నుండి ప్రారంభమైన ఈ మహా పాదయాత్ర ముగింపు సభకు గోషామహల్ నియోజకవర్గం నుండి బిజెపి నాయకుడు, 'సత్య సుందర్ హెల్పింగ్ ఫౌండేషన్' చైర్మన్ ఠాకూర్ గోపాల్ సింగ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్ ల నేతృత్వంలో వందలాది మంది కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చారు.
పార్టీ జెండాలు, జాతీయ జెండాలు, ప్రధాని మోదీ, అమిత్ షాల ప్లకార్డులు చేతబూని "జై శ్రీరామ్", "భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలు చేస్తూ ఎంజే మార్కెట్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా ఠాకూర్ గోపాల్ సింగ్ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి కలిగిన నాయకత్వంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి మోదీ, అమిత్ షాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి నష్టం కలిగిస్తున్న బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు తిరస్కరించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. బిజెపి నాయకులు బద్రీనాథ్ సింగ్, సందీప్ సింగ్, ఇంద్రపాల్ సింగ్, గణేష్ మోరే, సూరజ్ లతో పాటు 1,200 మందికి పైగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రహదారులపై ధాన్యం ఆరబెడితే క్రిమినల్ కేసులు

- ధాన్యం కుప్పను ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి.. రైతులకు పోలీసుల హెచ్చరిక



సత్తుపల్లి, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): ప్రభుత్వ రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సత్తుపల్లి సీఐ తుమ్మలపల్లి శ్రీహరి హెచ్చరించారు. సదాశివునిపాలెం గ్రామంలో రహదారిపై ఆరబోసిన ధాన్యం కుప్పను ద్విచక్రవాహనదారుడు ఢీకొని మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఈ హెచ్చరికలు జారీ చేశారు.గ్రామానికి చెందిన గాయం రాము, చాట్ల లక్ష్మి రహదారిపై ధాన్యం ఆరబోశారు. అదే మార్గంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తుంబూరు గ్రామానికి చెందిన తురకా రాంబాబు ధాన్యం కుప్పను ఢీకొని కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.రహదారులపై ధాన్యం ఆరబెట్టడమే కాకుండా వాహనాలు వెళ్లకుండా రాళ్లు, ముళ్లకంచెలు, కట్టెలు ఏర్పాటు చేయడం ప్రమాదకరమని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేదా ప్రత్యామ్నాయ కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలని సూచించారు. రోడ్లపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమైతే పూర్తి బాధ్యత యజమానులదేనని స్పష్టం చేశారు.



ఖమ్మం మహిళకు అమెరికాలో

అరుదైన గౌరవం

- ఓహియో మైనారిటీ డెవలప్‌మెంట్ బోర్డు వైస్ ప్రెసిడెంట్‌గా రాధికా రామసహాయం

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్):ఖమ్మంలో జన్మించిన రాధికా రామసహాయానికి అమెరికాలోని ఓహియో రాష్ట్రంలో అరుదైన గౌరవం దక్కింది. మైనారిటీ డెవలప్‌మెంట్ ఫైనాన్సింగ్ అడ్వైజరీ బోర్డు వైస్ ప్రెసిడెంట్‌గా ఆమెను ఓహియో గవర్నర్ మైక్ డివైన్ తిరిగి నియమించినట్లు సమాచారం. ఈ బాధ్యతలో ఆమె 2033 వరకు కొనసాగనున్నారు.ఉన్నత పదవితో పాటు సేవాభావంతోనూ రాధికా గుర్తింపు పొందారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు 'కార్డు' స్వచ్ఛంద సంస్థ ద్వారా సహాయం అందించడంలో భాగస్వామ్యమయ్యారు. కరోనా సమయంలో ఉపాధి కోల్పోయిన వలస కార్మికులకు ఆహారం, ఇతర సహాయాలు అందించే కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.ఖమ్మంలో జన్మించిన ఆమె, రఘురామ్ రెడ్డిని వివాహం చేసుకుని అమెరికాలో స్థిరపడ్డారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగిన రాధికా రామసహాయం విజయంపై ఖమ్మం ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ప్రస్థానం యువతకు, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

లక్ష్యం, క్రమశిక్షణ, కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

- విద్యార్థులకు మండల ప్రత్యేక అధికారి బండి రాజేశ్వరి సూచన



రామడుగు, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్):విద్యార్థులు సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, క్రమశిక్షణతో నిరంతరం కృషి చేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మండల ప్రత్యేక అధికారి బండి రాజేశ్వరి అన్నారు. రామడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ సంగి రాజేశ్వరి, ఎంఈఓ రంగనాథ శర్మతో కలిసి ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, రుచి, పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వార్షిక పరీక్షల సన్నద్ధత, సిలబస్ పూర్తి, వసతి గృహాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు.తాను కూడా గతంలో వసతి గృహంలో ఉంటూ చదువుకున్నానని బండి రాజేశ్వరి విద్యార్థులతో తన అనుభవాన్ని పంచుకున్నారు. వసతి గృహాల్లో ఉండటం చదువుకు ఆటంకం కాదని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు.ఎంపీడీఓ సంగి రాజేశ్వరి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధమై మంచి మార్కులు సాధించాలని కోరారు. ఎంఈఓ రంగనాథ శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వెనుకబడిన వారికి అదనపు బోధన అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల భద్రతపై నిర్లక్ష్యం తగదు

- బోనకల్ గురుకుల ప్రమాదంపై కలెక్టర్‌కు స్వేరోస్ ఫిర్యాదు



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): బోనకల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో తరగతి గది పైకప్పు పెచ్చులు ఊడిపడి ఇద్దరు విద్యార్థినులు గాయపడిన ఘటన అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు కోండ్రు రామచంద్రు విమర్శించారు. నాలుగేళ్లుగా తరగతి గదుల పైకప్పులు శిథిలావస్థలో ఉన్నా మరమ్మతులు చేపట్టకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు.ఈ ఘటనలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు పూజిత, కీర్తన గాయపడగా, పూజిత తలకు ఆరు కుట్లు పడ్డాయని తెలిపారు. ప్రస్తుతం ఇద్దరూ కోలుకుంటున్నారని పేర్కొన్నారు.పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించిన రామచంద్రు, సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ దివాకర టీఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బోనకల్ గురుకుల భవనానికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల భవనాల స్థితిగతులను తనిఖీ చేయాలని కోరారు.పేద విద్యార్థినుల భద్రత కోసం స్వేరోస్ అండగా నిలుస్తుందని, వారికి సంపూర్ణ రక్షణ కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని రామచంద్రు స్పష్టం చేశారు.

నృత్య దర్శకుడు ఆర్.ఎం. ప్రసాద్‌కు

ఇండియన్ గ్లోరీ అవార్డు

● 30 ఏళ్ల కళా ప్రస్థానానికి గుర్తింపు.. నటుడు సుమన్ చేతుల మీదుగా పురస్కారం అందజేత



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్):మూడు దశాబ్దాలుగా నృత్య రంగంలో సేవలందిస్తున్న నృత్య దర్శకుడు, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల సాంస్కృతిక అధ్యాపకుడు ఆర్.ఎం. ప్రసాద్‌కు ప్రతిష్ఠాత్మక ఇండియన్ గ్లోరీ అవార్డు-2026 లభించింది. కళారత్న మూవీస్, రాజు ఎంటర్‌టైనర్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. 30 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు నృత్యంలో శిక్షణ ఇస్తూ, ఔత్సాహిక కళాకారులను తీర్చిదిద్దుతున్న ప్రసాద్ సేవలను ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు కొనియాడారు. ఆయన కళా ప్రస్థానానికి ఈ అవార్డు గుర్తింపుగా నిలుస్తుందని అభినందించారు. కార్యక్రమంలో దర్శకులు రేలంగి నరసింహారావు, వీఎన్ ఆదిత్య, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, నటులు, కళాకారులు పాల్గొన్నారు.**ప్రియదర్శిని విద్యాసంస్థల్లో అభినందనలు**ఆర్.ఎం. ప్రసాద్‌కు ఇండియన్ గ్లోరీ అవార్డు రావడం పట్ల ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత డాక్టర్ కె. నవీన్ బాబు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నవీన్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రసాద్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

నిత్యావసర ధరల పెరుగుదలతో

సామాన్యుడిపై భారం!

- ఆదాయం అంతంతమాత్రం.. ఖర్చులు అపరిమితం.. సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు



మల్లంపల్లి నవంబర్ 2 (పి.సి.డబ్ల్యూ న్యూస్): రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు భారంగా మారుతున్నాయి. బియ్యం, పప్పులు, వంటనూనె, పాలు, గుడ్లు, కూరగాయల ధరలు పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పరిమిత ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న సామాన్యులకు పెరుగుతున్న ఖర్చులు భారంగా పరిణమిస్తున్నాయి. **పెరుగుతున్న ధరలు.. కుదేలవుతున్న కుటుంబ బడ్జెట్!** ఇప్పటికే ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ప్రయాణ ఖర్చులతో సతమతమవుతున్న కుటుంబాలకు నిత్యావసరాల ధరల పెరుగుదల అదనపు భారంగా మారింది. నెల ప్రారంభంలో వచ్చిన సంపాదన నెలాఖరు వరకు సరిపోని పరిస్థితి నెలకొంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **వంటింటి నిర్వహణ గృహిణులకు సవాల్**నిత్యావసరాల ధరల ప్రభావం ప్రధానంగా వంటింటిపై పడుతోంది. కూరగాయలు, పప్పులు, నూనె కొనుగోలు చేసేటప్పుడు గృహిణులు ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది. కుటుంబ అవసరాలను తీర్చేందుకు కొన్ని ఖర్చులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా రోజువారీ కూలీలు, చిరు ఉద్యోగులు, చిన్న వ్యాపారులపై ధరల భారం తీవ్ర ప్రభావం చూపుతోంది. **ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి**మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు. కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయించడం వంటి వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో నిత్యావసర సరుకులు అందేలా ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. **సామాన్యుడికి ఉపశమనం ఎప్పుడో?**రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో ఆదాయానికి, ఖర్చులకు మధ్య అంతరం పెరుగుతోంది. ధరల పెరుగుదల నుంచి సామాన్యులకు ఊరట కల్పించేలా ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో లభించినప్పుడే పేద, మధ్యతరగతి కుటుంబాలకు నిజమైన ఉపశమనం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

అంగన్వాడీలకు రూ.18 వేల వేతనం అమలు చేయాలి

- రిటైర్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి.. కలెక్టరేట్ ఎదుట ఆందోళన





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్):అంగన్వాడీ ఉద్యోగులకు నెలకు రూ.18 వేల వేతనం, రూ.10 వేల పింఛన్ అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు శింగు నర్సింహారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పెండింగ్ రిటైర్మెంట్ బకాయిలు చెల్లించడంతో పాటు మెనూ ఛార్జీలు పెంచాలని, అదనపు విధులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు, రూ.25 లక్షల ప్రమాద బీమా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సీహెచ్ సీతామహాలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ ఝాన్సీ, ఎస్. హస్నాబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైద్య సేవలకు ప్రతిష్టాత్మక

"ఇండియన్ గ్లోరీ అవార్డు"

● ఆరోగ్యమే మహాభాగ్యమనే సందేశంతో ప్రజలకు సహజ వైద్యంపై అవగాహన.. ● పిసి వీరస్వామి సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) : అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రకృతి వైద్య విధానాల ద్వారా ఆరోగ్యంపై నమ్మకం కల్పిస్తూ, సహజ సిద్ధమైన జీవనశైలి ప్రాముఖ్యతను ప్రజలకు చేరువ చేస్తున్న ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు, సిద్ధార్థ ప్రకృతి ఆరోగ్య కేంద్రం నిర్వాహకులు పిసి వీరస్వామికి ప్రతిష్టాత్మక ఇండియన్ గ్లోరీ అవార్డు లభించింది. ఆక్యుపంక్చర్, నేచర్ కేర్, నాడీ థెరపిస్ట్‌గా ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కడం విశేషం.వందే భారత్ చిత్ర దర్శక, నిర్మాత ముళ్ల రమేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన ఇండియన్ గ్లోరీ అవార్డ్స్ వేడుకలో వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న ప్రతిభావంతులను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా సమాజానికి సేవలందిస్తూ తమదైన ముద్ర వేసిన వ్యక్తులను ప్రోత్సహించడం, వారి సేవలను సమాజానికి పరిచయం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నటుడు సుమన్ తల్వార్, ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు హాజరై అవార్డులను ప్రదానం చేశారు.సహజ సిద్ధమైన ఆరోగ్య విధానాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ, ప్రకృతి వైద్యంపై అవగాహన పెంపొందించడంలో పిసి వీరస్వామి చేస్తున్న కృషిని నిర్వాహకులు ప్రత్యేకంగా గుర్తించారు. ఆరోగ్యమే నిజమైన సంపద అనే భావనతో ప్రజలకు ప్రకృతి వైద్య విధానాలను చేరువ చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించడం ద్వారా ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత పిసి వీరస్వామి మాట్లాడుతూ... ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రకృతి వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేయడం, సహజ సిద్ధమైన జీవన విధానం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ అవార్డు తన సేవా ప్రయాణంలో మరింత ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా అంకితభావంతో సేవలందిస్తున్న పిసి వీరస్వామికి ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం పట్ల అభిమానులు, ప్రకృతి వైద్య నిపుణులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. సమాజానికి ఆరోగ్య అవగాహనను పంచే ఆయన సేవా ప్రయాణం మరింత మందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని అభిలషించారు.

బాలల భద్రత సమాజ బాధ్యత

- అక్రమ రవాణా నిర్మూలనలో భాగస్వాములు కండి!

- ఆడపిల్లలే కాదు.. ప్రతి చిన్నారి భవిష్యత్తుకు రక్షణ కల్పించాలి

- మానవ అక్రమ రవాణాపై "మై ఛాయిసెస్ ఫౌండేషన్" స్టేట్ కో-ఆర్డినేటర్ క్రాంతి అహరోన్ పిలుపు







ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) : చిన్నారుల బాల్యం చిదిమేస్తూ, వారి భవిష్యత్తును చీకట్లోకి నెట్టేస్తున్న మానవ అక్రమ రవాణా మహమ్మారిని అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మై ఛాయిసెస్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ క్రాంతి అహరోన్ పిలుపునిచ్చారు. అభం శుభం తెలియని బాలబాలికలు అక్రమ రవాణా ముఠాల బారిన పడకుండా కుటుంబాలు, సమాజం, ప్రభుత్వ శాఖలు సమష్టిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సోప్ ఆర్డీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురక్షిత గ్రామ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎదులాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్రాంతి అహరోన్ మాట్లాడుతూ.. గత ఎనిమిదేళ్లుగా తెలంగాణ పోలీస్ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ భాగస్వామ్యంతో ఖమ్మం జిల్లాలో స్కోప్ ఆర్డీ ద్వారా సురక్షిత గ్రామ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మానవ అక్రమ రవాణా అత్యంత తీవ్రమైన నేరమని, పిల్లలు, మహిళలను దోపిడీ చేయాలనే ఉద్దేశంతో మోసం, బలవంతం, ప్రలోభాల ద్వారా వారిని నియమించుకోవడం, తరలించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అక్రమ రవాణా బాధితుల్లో 71 శాతం మంది మహిళలు, బాలికలే ఉండటం ఆందోళనకరమన్నారు. వారిలో అధిక సంఖ్యలో లైంగిక దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. బాధితుల్లో కేవలం కొద్దిమందే రక్షణ పొందుతున్న పరిస్థితి ఉందని, మిగిలిన వారి ఆచూకీ తెలియకపోవడం మానవ సమాజం ముందున్న పెను సవాలని అన్నారు.ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలు, పరిచయాలు, భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, భయంలేని వాతావరణంలో పిల్లలు తమ సమస్యలను తల్లిదండ్రులతో పంచుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే జాతీయ హెల్ప్‌లైన్ 18004198588 లేదా చైల్డ్‌లైన్ 1098కు తెలియజేయాలని కోరారు.ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగుల్ మీరా మాట్లాడుతూ.. బాలల అక్రమ రవాణా నిరోధానికి తెలంగాణ పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో క్షేత్రస్థాయిలో, ప్రమాదకర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, అసురక్షిత వలసలు, గృహహింస వంటి పరిస్థితులు కూడా మానవ అక్రమ రవాణాకు కారణమవుతున్నాయని వివరించారు. గ్రామాల్లో లేదా ఇతర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, పిల్లల భద్రతకు ముప్పు ఉందని భావించినా వెంటనే పోలీస్ ఎమర్జెన్సీ నంబర్ 112కు సమాచారం అందించాలని కోరారు. అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను పిల్లలు స్వీకరించకూడదని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగానికి దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.బాలల సంక్షేమ కమిటీ సభ్యులు లక్ష్మయ్య మాట్లాడుతూ.. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా బాలబాలికల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ శాఖ, మై ఛాయిసెస్ ఫౌండేషన్, స్కోప్ ఆర్డీ సంస్థలు అందిస్తున్న సేవలను అభినందించారు.అనంతరం విద్యార్థినీ విద్యార్థులు మానవ అక్రమ రవాణా వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రదర్శిం చిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. బాలలకు అవగాహన కల్పిం చేందుకు రూపొందించిన కామిక్ పుస్తకాలను పంపిణీ చేశారు. స్కోప్ ఆర్డీ కో-ఆర్డినేటర్ కె. సుజాత, సీడబ్ల్యూసీ సభ్యులు లక్ష్మ య్య, షీ టీం కానిస్టేబుల్ కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యా యులు భాస్కరరావు, అంగన్‌వాడీ టీచర్ దుర్గ, ఆశా వర్కర్ జానమ్మ, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



48 ప్రభుత్వ స్కూళ్లను దత్తత తీసుకున్న మంచు లక్ష్మి

ప్రముఖ సినీ నటి, సామాజిక కార్యకర్త మంచు లక్ష్మి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నడుం బిగించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్టు ఆమె తెలిపారు. తన 'టీచ్ ఫర్ చేంజ్' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన మంచు లక్ష్మి... చౌటకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ 'టీచ్ ఫర్ చేంజ్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన లక్ష్మి... గ్రామీణ విద్యార్థుల కోసం అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు.

దత్తత తీసుకున్న పాఠశాలల్లో స్మార్ట్ ఎల్ఈడీ టీవీలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. నాణ్యమైన విద్య ద్వారానే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు తనవంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

రూ.800 కోట్ల క్లబ్‌లోకి 'జైలర్ 2'..

కోలీవుడ్‌లో రజనీకాంత్ సరికొత్త రికార్డ్!



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన 18 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్ల వసూళ్ల మార్క్‌ను దాటిన తొలి తమిళ చిత్రంగా ఈ సినిమా రికార్డు నెలకొల్పింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో అక్టోబర్ 15న విడుదలైన ఈ యాక్షన్ కామెడీ సీక్వెల్, వసూళ్లలో తన జోరును కొనసాగిస్తోంది.

ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ 'సాక్‌నిల్క్' వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 18వ రోజు నాటికి ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 808 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇందులో దేశీయంగా రూ. 456 కోట్ల నెట్ (సుమారు రూ. 534 కోట్ల గ్రాస్) రాబట్టగా, విదేశాల్లో రూ. 273-274 కోట్ల వరకు వసూళ్లు సాధించింది. 18వ రోజైన ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 11.2 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం.ఈ భారీ వసూళ్లతో 'జైలర్ 2' తమిళ చిత్ర పరిశ్రమలో మునుపటి రికార్డులన్నింటినీ బద్దలు కొట్టింది. రజనీకాంత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన '2.0' చిత్రం లైఫ్‌టైమ్ కలెక్షన్లను కూడా ఇది అధిగమించింది. అంతేకాకుండా 'పీకే', 'ఛావా' వంటి చిత్రాల మొత్తం వసూళ్లను కూడా దాటి 2026లో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ఈ వారం చివర్లో 'రామాయణ' వంటి భారీ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో 'జైలర్ 2' వసూళ్ల వేగం కొంత తగ్గే అవకాశం ఉంది.

డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

● పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు తోటకూర వజ్రేష్ యాదవ్ వినతి



జవహర్‌నగర్, నవంబర్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్): జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి స్థానిక ప్రజలకు ఉపశమనం కల్పించాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. ఢిల్లీలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌తో ప్రత్యేకంగా సమావేశమై డంపింగ్ యార్డ్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న దుర్వాసన, గాలి, నీటి కాలుష్యం, ఆరోగ్య సమస్యలను వివరించారు.మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని, సంబంధిత శాఖల సమన్వయంతో శాస్త్రీయ పద్ధతుల్లో డంపింగ్ యార్డ్ నిర్వహణ చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రేమలో దారుణంగా మోసపోయా : రెజీనా కసాండ్రా

ఇతరుల ప్రేమ కన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం ముఖ్యమన్న నటి

విభిన్నమైన పాత్రలతో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రెజీనా కసాండ్రా... తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి సంచలన విషయాలు వెల్లడించారు. గతంలో తాను ప్రేమలో దారుణంగా మోసపోయానని, ఆ కారణంగా తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లానని ఆమె తెలిపారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో నటించిన 'మూకుత్తి అమ్మన్ 2' (తెలుగులో 'మహాశక్తి') చిత్ర ప్రచార కార్యక్రమాల్లో ఈ వ్యాఖ్యలు చేశారు.

తన గత ప్రేమ బంధం గురించి మాట్లాడుతూ... "2020లో నా జీవితంలో ఊహించని ఘటన జరిగింది. నేను ప్రేమించిన వ్యక్తి నన్ను మోసం చేయడంతో ఆ బంధం ముగిసిపోయింది. ఆ పరిణామం నన్ను మానసికంగా కుంగదీసింది. చాలా కాలం డిప్రెషన్‌తో బాధపడ్డాను. ఆ బాధ నుంచి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది" అని రెజీనా భావోద్వేగానికి గురయ్యారు.

ఈ కష్టకాలం నుంచి బయటపడటానికి తనకు తానే సమయం కేటాయించుకోవడం ఎంతో సహాయపడిందని ఆమె అన్నారు. "ఇతరుల నుంచి ప్రేమను ఆశించే ముందు, మనల్ని మనం ప్రేమించుకోవడం చాలా ముఖ్యం" అని పేర్కొన్నారు. యువతులు లైంగిక వేధింపులు వంటి చేదు అనుభవాలు ఎదుర్కొన్నప్పుడు తమను తాము నిందించుకోవద్దని సూచించారు. బాధను మనసులో దాచుకోకుండా, నమ్మకమైన వారితో పంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె సలహా ఇచ్చారు.





'నగీనా'గా మారిన జాన్వీ.. తల్లి శ్రీదేవికి ఐకానిక్ నివాళి!

యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ తన తల్లి, దివంగత నటి శ్రీదేవిని మరోసారి గుర్తుచేసుకున్నారు. హాలోవీన్ సెలబ్రేషన్ ను పురస్కరించుకుని, శ్రీదేవి కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిన 'నగీనా' (1986) సినిమాలోని ఆమె ఐకానిక్ లుక్‌ను రీక్రియేట్ చేశారు. అచ్చం తన తల్లిని పోలినట్టుగా సిద్ధమై, ఆ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోగా, అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.వివరాల్లోకి వెళితే, హాలోవీన్ కోసం జాన్వీ కపూర్ 'నాగిన' చిత్రంలోని శ్రీదేవి పాత్రను ఎంచుకున్నారు. గులాబీ రంగు కాస్ట్యూమ్, దానికి సరిపోయే ఆభరణాలు, ప్రత్యేకమైన మేకప్, హెయిర్‌స్టైల్‌తో అప్పటి శ్రీదేవిని గుర్తుకుతెచ్చారు. కేవలం గెటప్‌తోనే సరిపెట్టకుండా, 'నగీనా' సినిమా పోస్టర్‌ను, కొన్ని నాటకీయ దృశ్యాలను కూడా రీక్రియేట్ చేసి అభిమానులను ఆకట్టుకున్నారు.ఈ ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ జాన్వీ ఓ భావోద్వేగ క్యాప్షన్ జోడించారు. "అందరికీ హ్యాపీ హాలోవీన్. సినీ చరిత్రలోని అత్యంత ఐకానిక్ క్షణాలలో ఒకదాన్ని రీక్రియేట్ చేయాల్సి వచ్చింది. హాలోవీన్ అంటే మనకు ఇష్టమైన పాత్రలు, పాప్ కల్చర్ మూమెంట్స్‌గా మారడం. కొన్నిసార్లు అవి భయపెట్టొచ్చు, కొన్నిసార్లు ఫన్నీగా ఉండొచ్చు, మరికొన్నిసార్లు అది ఒక నివాళి. అమ్మ (శ్రీదేవి), రిషి అంకుల్, అమ్రిష్ సర్‌ల కంటే ఐకానిక్ ఎవరుంటారు!!" అని ఆమె పేర్కొన్నారు.జాన్వీ పోస్ట్‌పై బాలీవుడ్ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నటి కరీనా కపూర్ "టూ టూ గుడ్" అని కామెంట్ చేయగా, ఆమె సోదరి కరిష్మా కపూర్ హార్ట్ ఎమోజీలతో తన ప్రేమను వ్యక్తం చేశారు. భారతీయ సినిమా తొలి మహిళా సూపర్‌స్టార్‌గా కీర్తి పొందిన శ్రీదేవి, 'సద్మా', 'మిస్టర్ ఇండియా', 'చాందిని', 'లమ్హే' వంటి ఎన్నో మరపురాని చిత్రాలతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆమె నటించిన 'నగీనా' చిత్రం అప్పట్లో ఓ సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే పాత్రలో జాన్వీ కనిపించడంతో అభిమానులు శ్రీదేవిని గుర్తుచేసుకుంటున్నారు.